

పశుసంపద పరిరక్షణకు కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కూటమి ప్రభుత్వంలో పశు సంపద పరిరక్షణకు కృషి చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన స్వగ్రామంలో కనుమ పండగ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి గోవులను పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టామన్నారు. పశుగ్రాస క్షేత్రాలకు రాయితీ వంటి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించామన్నారు. మున్ముందు పాడి పరిశ్రమ అభివృద్ధికి, పశు సంపద పరిరక్షణకు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఉపయోగపడే విధంగా మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు.

అందరికీ 'ఆవాసం'

- పిఎంఎవై అర్బన్ 2.0 కింద పేదలకు ఇళ్లు
- గ్రామాల్లో సర్వే చేస్తున్న గృహ నిర్మాణ సిబ్బంది
- ఇప్పటివరకు 22,632 మంది లబ్ధిదారుల గుర్తింపు
- ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల సాయం



సర్వే చేయిస్తున్న సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇళ్లు లేని పేదలందరికీ గృహాలు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) పథకాన్ని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద ఆర్థికంగా వెనుకబడిన, తక్కువ ఆదాయం తరగతి (ఎల్ఐజి), ఎక్కువ ఆదాయం తరగతి (ఎంఐజి) కేటగిరీల్లో ఉన్న అర్బన్ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. అందుకయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులను వెచ్చించనున్నాయి. ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు ఇప్పటికే గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది సర్వే మొదలుపెట్టారు.

పిఎంఎవై అర్బన్ 2.0పై రెండు నెలల కిందట సర్వే కోసం గతేడాది అక్టోబరులోనే ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను వెలువరించింది. జిల్లావ్యాప్తంగా శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి రావడంతో ఈ పథకం అన్ని మండలాలకూ వర్తించనుంది. పథకం కింద ఎంపికైన లబ్ధిదారునికి బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ (బిఎల్‌సి) కేటగిరీలో ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షల ఆర్థికసాయం అందించనుంది. అందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలను, భార్యాభర్తల ఆధార్ కార్డులను, సామాజిక తరగతి ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు పత్రాలతో పాటు దరఖాస్తు చేసుకోవాలి. గతంలో తమ పేర్లతో ఎటువంటి గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు కాని వారికి మాత్రమే మంజూరు చేస్తారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని తమ పరిధిలోని గృహనిర్మాణ శాఖ ఎఇకి అందించాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ, సఫాయి కర్మచారి, అంగన్‌వాడీ వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర గుర్తించిన తరగతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. దరఖాస్తుల వివరాల నమోదుకు యునిఫైడ్ వెబ్ పోర్టల్‌నూ ప్రారంభించింది. లబ్ధిదారులు నేరుగా నూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

అర్బన్ ప్రాంతాల్లో 818 మంది గుర్తింపు

జిల్లాలో నాలుగు అర్బన్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 818 మందికి గృహాలు లేనట్లు సర్వేలో గుర్తించారు. శ్రీకాకుళం అర్బన్‌లో 120 మంది తమకు ఇళ్లు కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమదాలవలస అర్బన్‌లో 337 మందికి ఇళ్లు లేనట్లు తేలింది. ఇచ్ఛాపురంలో 134 మందికి, పలాస-కాశీబుగ్గలో 227 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు సర్వే కొనసాగనుంది. సర్వే పూర్తయిన తర్వాత ఏప్రిల్‌లో ఇళ్లను కేటాయించనుంది.

22,632 మంది లబ్ధిదారుల గుర్తింపు

పిఎంఎవై అర్బన్ 2.0 పథకం కోసం గతేడాది అక్టోబరులో సర్వే చేపట్టారు. గ్రామాల్లో గృహ నిర్మాణ శాఖ అధికారులు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. గృహ నిర్మాణశాఖ, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వేలో ఇప్పటివరకు 22,632 మందిని ఇళ్లు లేని పేదలుగా గుర్తించారు. ఇందులో 21,814 గ్రామీణ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు, 818 మంది పట్టణ పరిధిలోని పేదలు ఉన్నారు. రణస్థలం మండలంలో అత్యధికంగా 1249 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు సర్వేలో గుర్తించారు. జలుమూరు మండలంలో 1220 మందికి, పోలాకిలో 1202 మంది ఇళ్లు లేని పేదలు ఉన్నట్లు గుర్తించారు. గార మండలంలో 1131 మంది, కవిటిలో 1110 మంది, కంచిలిలో 1101 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు గుర్తించారు. ఎచ్చెర్లలో 1082 మందికి, సారవకోటలో 1075 మందికి, నరసన్నపేటలో 1050 మందికి ఇళ్లు అవసరమైనట్లుగా సర్వేలో గుర్తించారు. మందసలో అత్యల్పంగా 144 మంది మాత్రమే ఇళ్లు కోరుకున్నట్లుగా తెలుస్తోంది. టెక్కలిలో 268 మందికి, కోటబొమ్మాళిలో 322 మందికి, ఎల్ఎన్‌పేటలో 354 మందికి, హిరమండలంలో 435 మందికి ఇళ్లు లేనట్లుగా సర్వేలో వచ్చింది.



బుధవారం బోసిపోయి ఖాళీగా ఉన్న రోడ్డు

నాడు - నేడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి పర్వదినాలకు పదిహేను రోజుల ముందు నుంచి నగరంలోని వ్యాపార సంస్థలు, వ్యాపార కూడళ్లు రద్దీగా కనిపించారు. గడచిన నాలుగు రోజులుగా ప్రధాన రహదారుల్లోని వస్త్ర దుకాణాలు, మార్కెట్ కిక్కిరిసిపోవడంతో రాకపోకలు సాగించలేనంత రద్దీగా కనిపించాయి. కొత్త దుస్తుల కొనుగోలుకు నగర వాసులతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చి కొనుగోలు చేశారు. ఆ సమయంలో వాహనాల రద్దీ పెరగడంతో నగరంలో అనువైన స్థలం లేక అవస్థలు పడ్డారు. దీంతో ట్రాఫిక్‌నకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేసినా అక్కడా పార్కింగ్ స్థలానికి మించి వాహనాలు నిలుపుదల చేయడంతో నడిచి వెళ్లే వారు సైతం ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా రద్దీ కారణంగా స్థానిక ప్రజలు సైతం ఇబ్బంది పడ్డారు. ఇదంతా సంక్రాంతి రోజు వరకు గడచిన పది రోజుల పాటు సాగింది. కనుమ రోజైన బుధవారం అందుకు భిన్నంగా కనిపించింది. ఉదయం మాంసం దుకాణాల వద్ద కనిపించిన రద్దీ ఆ తర్వాత నగరంలో పెద్దగా కనిపించలేదు. వస్త్ర దుకాణాలు ఖాళీగా కనిపించాయి. మార్కెట్ సైతం ఖాళీగా ఉండడంతో రోడ్లపై జనం కరవయ్యారు. దీంతో నగరంలోని ప్రధాన రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. సాధారణ రోజుల్లో ఉండే రద్దీ కూడా లేకపోవడంతో నిర్మానుష్యంగా కనిపించాయి.



సంక్రాంతి ముందు రద్దీగా ఉన్న జిటి రోడ్డు

దేవాదాయ కమిషనర్ పర్యటన



ఆలయాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ బుధవారం కొత్తూరు, ఇరపాడు, మెట్టూరు బిట్-3 ఆలయాలను సందర్శించారు. ఆలయాల అభివృద్ధికి టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆలయాలకు, రోడ్ల అభివృద్ధికి రూ.1.35 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆలయానికి వెళ్లే నూతన రోడ్లను పరిశీలించారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, లోతుగెడ్డ ఇందిరారామ్, లోతుగడ్డ ఆనంద్, పడాల వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి- కవిటి

సంక్రాంతి శోభతో పల్లెలు శోభాయమానంగా మారాయి. వలస పక్షుల చేరికతో కుటుంబాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు నభూతో నభవిష్యత్ అన్నట్టుగా సాగాయి. అందులో భాగంగా కవిటి అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సందడిగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిని సావిత్రి - శైలు సాధించగా, రెండో బహుమతి గీతా - పూజ, మూడవ బహుమతి లక్ష్మీ - జ్యోత్స్న కైవసం చేసుకున్నారు. అలాగే అగ్నికుల క్షత్రియ సంఘం తరపున పదో తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న తనుశ్రీ, ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు తెచ్చుకున్న పొల్లాయి జస్వంత్‌ను నగదు బహుమతితో పాటు ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత సైనికులను, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన పొల్లాయి లక్ష్మిని ఘనంగా సన్మానించి వారి సేవలు కొనియాడారు. ముఖ్యంగా అగ్నికుల క్షత్రియుల దహన సంస్కరాల్లో పాటుపడుతున్న ఉమాపతిని సత్కరించి నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, పి.సింహాచలం, పి.దేవరాజు, పి.కృష్ణ, డి.పురుషోత్తం, పి.ముకుందరావు, పి.ఉమాపతి, పి.శ్రీను, టి.రవి, టి.మోహనరావు, పి.నీలాచలం పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న సభ్యులు



ఇచ్ఛాపురం : మాంసాన్ని కొనుగోలు చేస్తున్న ప్రజలు

విందు... వినోదం

- భారీగా పెరిగిన మాంస విక్రయాలు
- పెరిగిన మద్యం అమ్మకాలు
- జిల్లాలో పలుచోట్ల జాతరలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంక్రాంతి పర్వదినాల్లో చివరి రోజైన కనుమ పండగ జిల్లాలో భలే పసందుగా సాగింది. పల్లెల్లో గోసేవ నిర్వహించి ఆవులకు పొంగళి తినిపించడం ఈ వేడుక ప్రత్యేకత. దీనికి తోడు మాంసాహార, మద్యం ప్రియులకు ఈ వేడకల్లో పట్టలేని ఆనందం. బుధవారం కనుమ కావడంతో మాంసాహారులను ఆపటం ఎవరి తరమూ కాలేదు. అన్‌స్టాప్‌బుల్‌గా ఆరగించేశారు. సాయంత్రం సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు, ఆలయాలు, జాతలను సందర్శించి కుటుంబాలతో సరదాగా గడిపారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించిన యాత్రలకు జనం పోటెత్తారు. ఉపాధి, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంత ఊళ్లకు చేరడంతో గ్రామీణ ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా సాగాయి.

పండగల పసందు కనుమ విందుతో ముగిసింది. కనుమ, పైగా బుధవారం కావడంతో మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా అన్నిచోట్లా మాంసాల కొనుగోళ్లతో ఆ దుకాణాలు రద్దీగా మారాయి. మటన్, నాటుకోడి మాసం ధరలు ఆకాశానికి అంటుకుని సమాన ధర పలికాయి. వేకువ జాము నుంచే ఈ దుకాణాల వద్ద జనం క్యూ కట్టారు. మటన్ ధర కిలో రూ.వెయ్యి నుంచి రూ.1100 వరకు విక్రయించారు. నాటుకోడి మాంసం కిలో లైవ్ రూ.700 వరకు విక్రయించారు. ఆపై ఖర్చుతో కలుపుకుని నాటుకోడి మాంసం కిలో రూ.800 నుంచి 900 మధ్య విక్రయించారు. బాయిలర్ చికెన్ ధర కిలో రూ.200 నుంచి రూ.240కి పెంచి విక్రయించారు. చేపల ధరలూ సైజు బట్టి పెరిగాయి.

విందులో మందు

మద్యం ప్రియులు ఈ వేడుకల్లో ఆనందడోలికల్లో తేలియాడారు. చుక్క ముక్కతో తెగ ఆనందించారు. జిల్లాలో 158 మద్యం షాపులు, 17 బార్లు ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబరు 31న జిల్లాలో ఒక్క రోజున రూ.2.10 కోట్లు విక్రయాలు జరిగాయి. సంక్రాంతి పర్వదినాలైన ఈ మూడు రోజుల్లో సుమారు రూ.20 నుంచి 25 కోట్లు మద్యం అమ్మకాలు జరిగి ఉంటుందని అంచనా. వీటికి తోడు జవాన్ల కోసం క్యాంటీన్లలో విక్రయించిన మద్యం జిల్లాలో విస్తారంగా వినియోగంలో ఉంది. మద్యం అమ్మకాల్లో అత్యంత కీలకంగా కనుమ రోజును భావిస్తారు. అదేస్థాయిలో అమ్మకాలు సాగాయని అధికారులు చెబుతున్నారు.

కనుమ రోజున పలు రకాల కార్యక్రమాల్లో పాల్గొని ఆనందించారు. కొత్త సినిమాలను చూసేందుకు జనం ఎగబడ్డారు. ఈ ఏడాది గేమ్ ఛేంజరు, డాకూ మహారాజ్, పండగ వచ్చింది పెద్ద సినిమాలు కాగా, ఇతర చిన్న సినిమాలు విడదల కావడంతో సినిమాలకు జనం క్యూకట్టారు. దీంతో థియేటర్ల ప్రాంగణాలన్నీ జన సందోహంగా మారాయి. ఆలయాలకు, నగరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లు, పార్కులకు వెళ్లి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

జన జాతర

కనుమ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతరలు నిర్వహించారు. జాతర్లకు పిల్లా పాపలు, కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆమదాలవలస ప్రాంతంలోని సంగమేశ్వర ఆలయ ప్రాంతంలో నిర్వహించిన జాతరకు సమీప ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు అప్పనమ్మతల్లి దేవాలయం వద్ద నిర్వహించిన జాతరకు పెద్దఎత్తున పాల్గొన్నారు. పాతపట్నం మండలం నీలమణిదుర్గమ్మ ఆలయ సందర్శనకు సందర్శకులు పోటెత్తారు. నరసన్నపేట మండలం జల్లువానిపేటలోని దానప్పతల్లి ఆలయం, కిటకిటలాడాయి. ఆమదావలస సంగమయ్య కొండ జాతర, పలాసలోని దేకురుకొండ, యాత్రలు జిల్లాలో నిర్వహించారు. ఈ యాత్రలు వినోదాన్ని పంచాయి. ఈ యాత్రలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలతో పాటు ఒడిశా నుంచి భారీగా జనం తరలిరావడంతో యాత్రా స్థలాలు సందడిగా కనిపించాయి.

మాంసం దుకాణాల వద్ద రద్దీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో బుధవారం కనుమ పండగ సందర్భంగా జోరుగా భారీగా మాంస విక్రయాలు సాగింది. వేకువ జామున నుంచే మాంసం కోసం దుకాణాల్లో ఎగబడ్డారు. ఒక్క రోజే రూ.లక్షల వ్యాపారం సాగింది. మెయిన్ రోడ్డులోని మటన్ దుకాణాల సాపుల వద్ద రద్దీ కనిపించింది. మేకలు, కోళ్ల కొనుగోలు చేసుకుని వాటాలు వేసుకున్నారు. ఎక్కడ చూసినా సాధారణ కాయగూరలు వద్ద కన్న మటన్ దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరారు.

జాతర్లకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన జాతరకు వేలల్లో యాత్రికులు పోటెత్తారు. మంగళ, బుధవారాలు జాతర నిర్వహించారు. గురువారం కూడా కొనసాగుతుంది. ఈ జాతరకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి యాత్రికులు వచ్చి పాల్గొన్నారు. సంగమేశ్వర కొండపై గుహలో ఉన్న సంగమేశ్వర స్వామిని దర్శించుకుని, కొండ దిగువ భాగంలో నిర్వహించిన జాతరలో చిన్న, పెద్ద అంతా పాల్గొని ఆనందంగా గడిపారు. జాతరలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, వీల్ చైర్, రకరకాల ఆటలను అందరూ ఆడి ఆనందంగా గడిపారు. ఏటా నిర్వహించే ఈ జాతరకు ఈ ఏడాదీ అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో జాతర నిర్వహించే ప్రాంతం అంతా యాత్రికులతో కిక్కిరిసిపోయింది. జాతరలో చిన్నారులు, పెద్దలు పాల్గొని వారికి కావాల్సిన ఆట వస్తువులు, తినుబండారాలను కొనుగోలు చేసి సందడిగా గడిపారు. ఈ జాతరకు జిల్లాలో ఉన్న ప్రజానీకంతో పాటు, ఇతర జిల్లాల్లో ఉద్యోగరీత్యా ఉన్న ఉద్యోగులు, వలస కూలీలు, బంధువులు అధిక సంఖ్యలో తరలిరావడంతో జాతర ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకుంది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పొందూరు : రాపాకలో నాటుబళ్ల పోటీలో పాల్గొన్న పోటీదారులు

అనధికార ఆశీల వసూళ్లు

మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో ఉన్న సంఘమేశ్వర స్వామి జాతరలో అనధికార ఆశీల వసూళ్లపై చిరు వర్తకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లుగా ఏటా సంఘమేశ్వర స్వామి జాతర నిర్వహించి మూడు రోజులు ఇక్కడకు వచ్చి చిన్న పిల్లల ఆటబొమ్మలు తినుబండారాలు అమ్మగా వచ్చే డబ్బులతో తాము జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కానీ, ఈ ఏడాది మొదటిరోజు పండగ జాతరకు వచ్చే ప్రజలుం తగ్గారని, అలాగే ఆశీల వసూళ్ల ఇలా అన్ని విధాల ఆదాయం తగ్గడంతో ఇబ్బందులకు గురవుతున్నామని చిరు వర్తకులు వాపోతున్నారు. దుకాణానికి ఒకలా రూ.వంద నుంచి రూ.500 వరకు వివిధ రకాలుగా ఆశీలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు ప్రేక్షకపాత్ర

ఏటా పండగ, కనుమ ముక్కనుమ మూడు రోజుల పాటు నిర్వహించే సంఘమేశ్వర జాతరలో పోలీసు అధికారులు కూడా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక కమిటీ వారికి నచ్చిన విధంగా వ్యవహరిస్తుంటే వారికి వత్తాసు పలుకుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతరకు వచ్చే మహిళలను ఆకతాయిలు వేధిస్తుంటారని, అలాగే అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై ఏటా వాహనాలు ఎక్కడికక్కడ గంటల కొద్దీ నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతుంటారని, ఆ సమస్యలను గట్టెక్కించాల్సిన పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నామని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. రహదారి రద్దీని నివారించాల్సిన పోలీసులు చేతులెత్తేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు సరైన ప్రణాళికతో వ్యవహరించి వాహనాల రద్దీని నివారించాలని పలువురు వాహనదారులు ప్రయాణికులు యత్రికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సెక్రటరీ వివరణ

అనధికార ఆశీల వసూళ్లపై పంచాయతీ సెక్రటరీ రవిని వివరణ కోరగా, పంచాయతీకి గాని, ప్రభుత్వానికి గాని ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. తాము ఎవరికి ఎటువంటి వసూళ్లకు అనుమతులు ఇవ్వలేదని అన్నారు. ఆశీల వసూళ్లు తమ దృష్టికి రాలేదని చెబుతుండడం విశేషం. పంచాయతీ పరిధిలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా అది పంచాయతీ కార్యదర్శిదే బాధ్యత అని పలువురు గుర్తుచేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి తనకు ఏమి సంబంధం లేదనడం పలు విమర్శలకు తావిసోంది.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో హట్కో కాలనీ పరిధిలో దేకురుకొండ ఉత్సవం సంక్రాంతి సందర్భంగా ఘనంగా జరిగింది. దేకురు కొండ ప్రాంతంలో భీముడు పాదాలు ఉంటాయి. జారుడు బల్ల లాంటి రాళ్లు ఉండటంతో ఏటా నవ దంపతులు వాటిని దర్శించుకుంటారు. కనుమ రోజున నిర్వహించిన యాత్ర పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది.

పొందూరు: పొందూరు మండలంలోని రాపాక, పొందూరు, కనిమెట్ట గ్రామాల్లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని బుధవారం కునుమ సందర్భంగా కోడేబళ్ల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడేబళ్ల వీధుల్లో పరుగులు పెట్టడంతో వాటి వెంట యువత పరుగులు పెడుతూ సందడి చేశారు. కొన్నేళ్లుగా ఈ గ్రామాల్లో కోడేబళ్ల జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

బూర్జ : బూర్జలోని చాకలి లచ్చమ్మ పేరంటాల జాతర గ్రామస్తులు సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. దీంతో లచ్చమ్మ తల్లి నామస్మరణతో ఆ గ్రామం మారుమోగింది.



ఆమదాలవలస : సంగమేశ్వర ఆలయానికి తరలివచ్చిన యాత్రికులు



జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు

నులివెచ్చని కిరణాలకు నిరీక్షణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

చలికాలం చంపేస్తోంది.. ఉదయం వేళలో బారెడు పొద్దెక్కినా మంచు తెరలు తొలగక సూర్యకిరణాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. మంగళవారం జాతీయ రహదారిపై పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉంది. నిండా మంచు కురుస్తండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఉదయం 9 గంటలైనా జాతీయ రహదారులు, గ్రామ రహదారుల్లో మంచుకురుస్తుండడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రబీలో వేసుకున్న అపరాలకు సైతం తీవ్రంగా దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోసమాలలో కనుమ రోజు భోగి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కోసమాలలో ఉన్న దేవాంగుల వీధిలో కనుమ రోజే భోగి నిర్వహించుకోవడం కొన్ని తరాలుగా ఆచారంగా వస్తుంది. ఈ వీధిలో నేత కార్మికులు ఎక్కువ మంది ఉన్నారు. వాళ్లందరూ పండగ రోజు వరకు దుస్తులు నేసే పనిలో బిజీగా ఉంటారు. వారికి భోగి రోజే భోగి చేసుకోవడం సాధ్యం కాదు. అందువల్ల కనుమ రోజు భోగి నిర్వహించుకోవడం ఆచారంగా వస్తుంది. ఈ ఏడాదీ ఈ గ్రామంలో కనుమ రోజు భోగి నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో బొచ్చు మోహనరావు, బొమ్మన వీరభద్రరావు, సురేష్‌కుమార్, తేజేశ్వరరావు, ఉమాశంకర్, ఆనందరావు, లోహిత్, కూర్మినాయుడు పాల్గొన్నారు.



కోసమాలలో భోగి మంట వేస్తున్న నేత కార్మికులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

7 నుంచి కమ్మసిగడాం జాతర

రణస్థలం రూరల్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు కమ్మ సిగడాం శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు మూడురోజులు జరుగనుందని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కమ్మసిగడాంలో శ్రీ మహాలక్ష్మి తల్లి కమ్మవారి కళ్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర సక్రమంగా జరిపించేందుకు జాతర మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఎవరు ఏ పనులు చేయాలి, కల్చరల్ ప్రోగ్రాం, జాతర అభివృద్ధి తదితర పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, వెలిచేటి సూర్యతేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శులు మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, వెలిచేటి మురళీధర్, సిహెచ్‌వి రాజేష్, వెలిచేటి సింహాచల రాయుడు, మన్నె కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, జి.రఘునాథ్, మన్నె సత్యనారాయణ, వెలిచేటి జగన్నాధరావు, మన్నె అప్పలరాజు, బోట్ల రాంబాబు పాల్గొన్నారు.

కూడు పెట్టని కులవృత్తి

ప్రజాశక్తి- బూర్జ

కుమ్మరుల జీవనం దుర్భరంగా మారింది. కులవృత్తిని వదులుకోలేక ఆధార పడినప్పటికీ పూటగడవని స్థితిలో కొట్టు మిట్టాడు తున్నామని కుమ్మరులు వాపో తున్నారు. మండలంలోని పాలవ లసలో నివాసముమున్న కుమ్మరు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కులవృత్తిని నమ్ముకున్న వారు వేరే పని చేయలేక వలస పోలేక గ్రామాల్లోనే కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని కుమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మట్టి పాత్రలకు గిరాకీ లేకపోవడంతో కష్టపడి తయారు చేసిన మట్టిపాత్రలు ఇంటికే పరిమితమయ్యాయని వాపోతున్నారు.


కుండలు అమ్మకానికి తీసుకువెళ్తున్న ఆదిలక్ష్మి

దెబ్బతీసిన ప్లాస్టిక్

మట్టి పాత్రలకు తగ్గిన డిమాండ్

మట్టి పాత్రలను ఉపయోగించిన ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వస్తువుల వైపు మొగ్గు చూపడంతో మట్టి పాత్రలకు గిరాకీ ఉండడం లేదని, ప్రజలు కూడా వీటిపై మోజు చూపడం లేదని కుమ్మరు వాపోతున్నారు. తాము తయారు చేసే ప్రతి ఒక్క వస్తువు ప్లాస్టిక్‌లో రావడంతో వినియోగదారులు కూడా ప్లాస్టిక్‌కు సంబంధించిన వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నారు.


కాల్చడానికి సిద్ధం చేసిన కుండలు

అందని సాయం

కులవృత్తులను ఆదుకుంటామని ప్రభుత్వాలు ప్రకటన గుప్పిస్తున్నప్పటికీ ఆర్థిక చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని కుమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వాలు ఆదుకోవాలి. అబివృద్ధిపై జీవనం సాగించలేక వలసలు పోలేక తీవ్ర అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం కులవృత్తుల వారిని ఆదుకోవాలి.

- కుమ్మరి అప్పన్న

కష్టానికి తగ్గ ఫలితం లేదు



ఎంతో కష్టపడి మట్టి పాత్రలు తయారు చేసుకున్నప్పటికీ అందుకు తగ్గ ఫలితం లభించడం లేదు. మట్టి పాత్రలకు గిరాకీ లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కుమ్మరి ఆదిలక్ష్మి


గాలిపటాల పోటీలో పాల్గొన్న చిన్నారులు

ముగిసిన కనుమ ఉత్సవాలు

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడ వద్ద ఉన్న శివానంద గిరిపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న కనుమ ఉత్సవాలు బుధవారం రాత్రితో విజయవంతంగా ముగిసింది. ముగ్గుల పోటీలతో ప్రారంభించి, గాలిపటాలు పోటీలు, సామూహిక త్రినాథస్వామి మేళాలు నిర్వహించారు. రాత్రి కొరియోగ్రాఫర్ కుమార్ డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యాన నిర్వహించిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. సంక్రాంతి ఉత్సవాలు సొంత ఊర్లకు వచ్చిన గ్రామస్తులు, బంధువులు, వేలాది మంది ప్రజలు కనుమ ఉత్సవాలు తిలకించడానికి భారీగా తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అభివృద్ధి కమిటీ సభ్యులు చేలు తీసుకుంది.


దుస్తులను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

దుస్తుల పంపిణీ

పొందూరు: స్థానిక కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి చేతులుమీదుగా సంఘ అధ్యక్షుడు కాకినాడ రాజారావు అందజేశారు. అలాగే సంఘం కార్యదర్శి అరసవెల్లి వెంకటరావు నలుగురు నిరుపేదలకు రూ.4 వేలు అందజేశారు. కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


అరసవల్లి సందర్శించిన జబర్దస్త్ టీమ్ సభ్యులు

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. సినీనటుడు సాయికుమార్, జబర్దస్త్ ఫేం నటులు అప్పారావు, కేశవ్ కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాలను కప్పి స్వామివారి చిత్ర పటాన్ని ఆలయ ఇఒ వై. భద్రాజీ అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి దాతల విరాళం

శ్రీకాకుళం నగరానికి చెందిన అందవరపు వెంకట ముఖేష్, కూన వేణుగోపాలరావులు కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సందర్శించారు. అనంతరం ఆలయ సూపరింటిండెంట్ కనకరాజును కలిసి రూ.1,01,116 వంతున వేర్వేరుగా చెక్కులను అందజేశారు.

గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అవసరం

ప్రజాశక్తి- పొందూరు

మనకు జన్మనిచ్చిన గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరి తోడ్పాటు, సహకారం ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోరింటలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన అవినాష్ సావె ఫౌండేషన్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగి, సిఐటియు నాయకులు కూన వెంకటరావు ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో తమ కుమారుడు పేరుమీదుగా ట్రస్టు ఏర్పాటు చేసి యువతను, చిన్నారులను ప్రోత్సహించడం గొప్ప గర్వించదగ్గ విషయమన్నారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలను సాధించవచ్చునని పేర్కొన్నారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ కూన వెంకటరావు, సిఐటియూ జిల్లా అధ్యక్షులు చింతాడ అమ్మన్నాయుడులు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మందికి ఉపాధిని కల్పిస్తూ ఎంతో ఆదాయాన్ని సమకూరుస్తున్న స్టీల్‌ప్లాంట్ ప్రవేటుపరం కాకుండా దానిని మనం పరరిక్షించుకోవాల్సిన అవసరం ఉందని, దీనికి ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. అనంతరం ముగ్గులు, క్రికెట్, వాలీబాల్ వంటి పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన యువతకు, మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను దుశ్శాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, ఐఇఆర్‌టి బాడాన అచ్యుతరావు, గ్రేహౌండ్స్ డిఎస్‌పి బాడాన సోమయ్య, టిడిపి బిసిసెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు, ట్రస్టు సెక్రటరీ దంపల మృదుల, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మహిళకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జగన్మోహనరావు

సేవామార్గం అనుసరణీయం

శ్రీకాకుళం అర్బన్: సేవాభావం అనుసరణీయమని, ప్రతిఒక్కరూ చేతనైనంత సేవ చేయడం వల్ల నిరుపేదలకు మేలు చేకూరుతుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. బుధవారం నగరంలోని శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆలయన పాల్గొన్నారు. వారితో పాటు అరసవల్లిలో నివాసముంటున్న అరవింద్ మహాదేవ్, సత్యాకినిల కుమారుడు సంజయ్, నంది ఉమాశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు పేదలకు అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. అనంతరం వృద్ధులకు, పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్మయరావు, శివతేజ, పవన్, ఆశ పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిరూపాలు సంక్రాంతి

కోటబొమ్మాళి: సంస్కృతికి ప్రతి రూపాలు భోగి, సంక్రాంతి, కనుమ పండగులని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ అన్నారు. మండలంలోని నీలంపేట పంచాయతీ గుంట జగన్నాథపురంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. సంక్రాంతి పండగ తెలుగువారిలో సమైక్యతను, సమర సభావాలను, సకలజీవులకు ప్రేమ, అప్యాయతలను పెంచగలిగే నిజమైన పండగని అన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ ఆర్థిక సౌజ్యంతో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఆ సంస్థ ప్రతినిధులు ఎల్.సంతోష్ స్వరూప్, రాంబాబులు ఏడేళ్లుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.


కోటబొమ్మాళి : బహుమతులను అందజేస్తున్న ఎంఇఒ ప్రతాప్


లావేరు : బహుమతులు అందజేస్తున్న శ్రీనువాసరావు, ఉత్తర లక్ష్మి

లావేరు: మహిళలు వేసిన ముగ్గులతో గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుందని విజయనగరం జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనువాసరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా బెజ్జిపురం పంచాయతీ బొంతుపేటలో జనసేన నాయకుడు బొంతు విజయకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను బెజ్జిపురం మాజీ సర్పంచ్ ఇజ్జాడ ఉత్తరాలక్ష్మి అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గులు వేయడం భారతీయుల సాంప్రదాయమని, ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో బొంతు వెంకటరమణ, ఇజ్జాడా రామారావు, కాశీనాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి పసుపుతాడు బంధనం

- చిన్నతనంలో పెళ్లి మానసిక స్థితికి ముప్పు
- శారీరక ఇబ్బందులతో అనారోగ్య సమస్యలు
- కిశోర వికాసంపై అవగాహనా లోపం
- మహిళల్లో అక్షరాస్యతతోనే అడ్డుకట్ట



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజాన్ని అర్థం చేసుకుంటున్న సమయంలో పెళ్లిపీటలు ఎక్కిస్తున్నారు. బాధ్యతలే తెలియని వయసులో మూడుముళ్లు వేయిస్తున్నారు. బిడ్డను ఓ అయ్య చేతిలో పెడితే తమ బరువు తీరుతుందని భావిస్తున్నారు. కిశోర వికాసం పథకంలో అవగాహన సమాజాన్ని అర్థం చేసుకుంటున్న సమయంలో పెళ్లి పీటలు ఎక్కిస్తున్నారు.

జిల్లాలో బాల్య వివాహాలు పెరుగుతుండడంతో అభం శుభం తెలియని చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక వెనుకబాటు, నిరక్షరాస్యతే దీనికి కారణం. బాలికల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మైనర్ల వివాహాల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నా మార్పు ఉండడం లేదు. గతంలో అమలులో ఉన్న కిశోర వికాసం నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కిశోర వికాసం పథకాన్ని విస్తృతం చేసింది.

నష్టాలివి..

చిన్న వయసులో గర్భం దాల్చితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం, రక్తహీనత సమస్యలతో బాధపడతారు. మానసికస్థితి, శారీరకశ్రమతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

పర్యవేక్షణ బాధ్యత

జిల్లా స్థాయిలో కలెక్టర్, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఐసిడిఎస్ శాఖ, తహశీల్దార్ బాల్యవివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది ఈ సాంఘిక దురాచారంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఈ వివాహాలపై సమాచారం తెలిసిన వారు 1098 నంబరుకు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

చట్టం అతిక్రమిస్తే చర్యలు



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిశోర వికాసం పథకంలో భాగంగా జిల్లాలో బాల్య వివాహాల కట్టడికి గ్రామ, మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అయినా ఎక్కడో చోట పెళ్లిళ్లు చేస్తూనే ఉన్నారు. ఇది చట్ట రీత్యా నేరం. సమాజం కలిసి వస్తేనే వీటిని నియంత్రించగలం.

- బి.శాంతి శ్రీ, జిల్లా సంక్షేమాధికారి, శ్రీకాకుళం

'కలమట' జన్మదినం

మెళియాపుట్టి: మండలంలో పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకట రమణ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహి ంచారు. కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పెద్దలక్ష్మీపురంలో మాజీ సర్పంచ్, జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర్ల రామారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మడపాల సీతారాం, రెంట కోట వాసు, తిరుపతిరావు, శశిభూషణరావు, ఢిల్లీరావు, హరిశంకర్, ఆనందరావు, నవీన్, గణపతిరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మాతలలో కలమట క్యాంపు కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న లలితకుమారి

హోమియో వైద్యునికి అరుదైన గౌరవం

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన హోమియో వైద్యుడు నంబాల విద్యాసాగర్‌కు అరుదైన గౌరవం లభించింది. భారత యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి యూత్ ఐకాన్‌గా గుర్తింపు పొందారు. ఈ నెల 11,12 తేదీల్లో ఢిల్లీలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమానికి విద్యాసాగర్ పాల్గొని 'ఆయుష్ రంగంలో యువత పాత్ర', 'హెల్తీ భారత్‌లో హోమియో'అంశాలపై మాట్లాడారు. ఈమేరకు ఆయనను యూత్ ఐకాన్‌గా గుర్తించి శాఖ అధికారులు ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ ప్రశంసాపత్రాన్ని అందుకోవడంపై కుటుంబ సభ్యులు, వైద్యులు అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న విద్యాసాగర్


విజేతలుగా నిలిచిన కిలంతర యువకులు

క్రికెట్ టోర్నీ విజేతగా కిలంతర

ప్రజాశక్తి- బూర్జ

సంక్రాంతి సంబరాలు సందర్భంగా అల్లెన పంచాయతీలో నిర్వహించిన శ్రీ ఉమా బాలంకేశ్వర స్వామి క్రికెట్ టోర్నమెంట్‌లో కిలంతర టీమ్ ప్రధమ బహుమతిని గెలిచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చదువు, ఉద్యోగంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు క్రీడలు ఎంతైనా అవసరమని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో రఘుమండ రాము, రవి, పెద్దింటి శ్రీనివాస్, రాజు, శ్రీరామ్, సురేష్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి మృతి

వజ్రపుకొత్తూరు: మాజీ ఎంపీ కీర్తిశేషులు హనుమంతు అప్పయ్యదొర సోదరుడు, మాజీ ఎంపిపి హనుమంతు రామారావుదొర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. 1995లో వజ్రపకొత్తూరు ఎంపిపిగా బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బెండి పంచాయతీ సర్పంచ్‌గా 1981 నుంచి 1995 వరకు పని చేశారు. ఆయన సతీమణి అనురాధ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన రామారావు సమకాలీన రాజకీయాలపై అనర్గళంగా మాట్లాడే చాతుర్యం ఆయన సొంతం. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమారుడు శ్రీనివాస్ నారాయణదొర, కుమార్తె మాధురి ఉన్నారు. ఈయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.


సురేష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

సలాం సైనికా..

కవిటి: దేశ సేవలో సైనికుల సేవలు వెలకట్టలేనివని 'సలాం సైనికా' అంటూ వక్తలు కొనియాడారు. జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉషోదయ యువజన సంఘం, కవిటి గ్రామస్తుల ఆధ్వర్యాన ఉషోదయ యువజన సంఘం భవనంలో సైనికుడు పొల్లాయి సురేష్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్న సైనికులకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలమని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి లక్ష్మణమూర్తి, జయరాం, ఆరింగి త్రివిక్రమరావు, ప్రగడ మణిబాబు, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న సర్పంచ్ సరిత

విజేతలకు బహుమతులు అందజేత

వజ్రపుకొత్తూరు : సంక్రాంతి వేడుకలు సందర్భంగా డోకులపాడులో ప్రేరణ యూత్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన మండల స్థాయి ప్రతిభా పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్పంచ్ వడ్డి సరిత, ప్రతినిధి కరుణకర్, ఎంపిటిసి కొరియి భాగ్యలక్ష్మి ఢిల్లీరావు, క్లబ్ అధ్యక్షులు పుక్కళ్ల దిలీప్ బహుమతులను అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జి.వాసవ్య, లండ మౌనిక, వంక వేణు, ఎల్. జాహ్నవిలకు అభినందించారు. మత్స్యకార సంఘ అధ్యక్షులు యంపల్ల పాపారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు జి.పోలయ్య పాల్గొన్నారు.

మహిళల సృజనాత్మకతకు రంగవల్లులు అద్దం పడతాయని మెట్టూరు ఎంపిటిసి కొండప్ప సురేఖ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ఒంకులూరులో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు.

ప్లాస్టిక్ తాళ్ల పరిశ్రమతో ఉపాధి

- సిమెంట్ సంచుల నుంచి ప్లాస్టిక్ వస్తువుల తయారీ
- ప్రభుత్వం చేయూత అందిస్తే మరింత అభివృద్ధి


తాళ్లను నేస్తున్న దంపతులు

ప్రజాశక్తి- కంచిలి

కాలుష్యానికి ముఖ్యకారణంగా నిలుస్తున్న ప్లాస్టిక్ నుంచి పర్యావరణాన్ని తమ చేతల ద్వారా కాపాడడమే కాకుండా ప్లాస్టిక్ సిమెంట్ సంచులను వస్తువులుగా మలచి పునర్వినియోగం చేస్తూ ఉపాధి అవకాశాలను పెంచుకుంటున్నారు కంచిలి మండలంలోని పెద్ద ఆముదాలపుట్టుగ, చిన్నఆముదాలపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, తలతంపర గ్రామస్తులు. కొబ్బరి పీచుతో తయారు చేసే వస్తువులకు ప్రత్యామ్నాయంగా సిమెంటు సంచుల దారాల నుంచి వస్తువులను తయారు చేస్తూ పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నారు.


పట్టణాల్లో కొనుగోలు చేసి తెచ్చిన సిమెంట్ సంచులు

కంచిలి మండలంలోని పెద్దఆముదాలపుట్టుగకు చెందిన భగవాన్ సాహూ, జగన్నాథసాహు, మురళీసాహు, గుణ సాహు కుటుంబాలకు చెందిన వారు 30 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో సిమెంట్ సంచుల నుంచి దారాలు సేకరించి, ఆ దారాలతో వ్యవసాయ అనుబంధ వస్తువులను తయారు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం ఆముదాలపుట్టుగతో పాటు చిన్నఆముదాలపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, తలతంపర ఐదు గ్రామాల ప్రజలకు ఈ ప్లాస్టిక్ దారాలతో చేసిన వస్తువుల ఉపాధి మార్గంగా మారింది. సుమారు 60 నుంచి 70 కుటుంబాలు ఈ పనిని చేస్తూ ఉపాధి పొందుతున్నాయి. సోంపేట, ఇచ్ఛాపురం, పలాస వంటి పట్టణాల్లో భవన నిర్మాణాల వద్దకు వెళ్లి సిమెంట్ సంచులను కొనుగోలు చేస్తుంటారు. ఒక్కో సంచికి రూ.2 నుంచి రూ.3 వరకు చెల్లిస్తారు. ఇలా తెచ్చిన సిమెంట్ సంచులను నీటిలో కడిగి వాటి నుంచి దారాలను సేకరిస్తారు. ఇలా సంచుల నుంచి దారాలు సేకరించడానికి ఒక్కో సిమెంట్ సంచికి రూపాయి ఇస్తుంటారు. ఈ గ్రామాల్లోని ఇళ్ల వద్ద ఉన్న మహిళలు, వృద్ధులు ఇలా సిమెంట్ సంచుల నుంచి దారాలు సేకరిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. రోజుకు ఇంట్లో పనులు చేసుకుంటూ రూ.వంద నుంచి రూ.150 వరకు ఆదాయం పొందుతుంటారు. ప్రభుత్వం చేయూత అందిస్తే ఈ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడమే కాకుండా ఎన్నో కుటుంబాలకు ఉపాధి అందిస్తుందని అన్నారు.


చెరువులో సంచులను శుభ్రం చేస్తున్న మహిళలు


దారాలు సేకరిస్తున్న వృద్ధురాలు

కొబ్బరి ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా...

ఉద్దానం ప్రాంతం అంటే కొబ్బరి పంటతో పాటు కొబ్బరి పీచుతో తయారు చేసిన అనుబంధ వస్తువులే గుర్తుకొస్తాయి. ఇక్కడ రైతు కుటుంబాల్లో, గ్రామాల్లో ఎక్కువ మంది ఇళ్లల్లోనూ, వ్యవసాయంలో ఉపయోగించే కందాళ్లు, ఉట్టి, ఇతర వస్తువులు కొబ్బరి పీచుతోనే తయారు చేస్తుంటారు. ఇటీవల కొబ్బరి దిగుబడులు తగ్గడం, ఆ వస్తువులు అధిక ధరలకు చేరుకోవడంతో ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ తాడులను ఉపయోగిస్తున్నారు. ఇక్కడ తయారైన ప్లాస్టిక్ తాళ్లు, ఇతర వస్తువులను ఒడిశా, అహ్మదాబాద్, కోల్‌కత్తా వంటి సుదూర ప్రాంతాలకు సైతం విక్రయిస్తున్నారు. అలాగే వారాంతపు సంతల్లోను, గ్రామాల్లోను ఈ వస్తువులకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. తమ వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులతో సిమెంట్ సంచులను కొనుగోలు చేసి వాటి నుంచి దారాలు సేకరించి కుటుంబ సభ్యులతో కలిసి తాళ్లను తయారు చేసుకుంటూ జీవనం పొందుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తే పెట్టుబడులు పెట్టి చిన్న యంత్రాలను కొనుగోలు చేసుకుని వాటి సాయంతో ఎక్కువ మొత్తంలో వస్తువులను తయారు చేసుకోవడమే కాకుండా తమ ఆదాయాన్ని జీవన ప్రమాణాలను పెంచుకొని అవకాశం ఉందని గ్రామాల్లోని శ్రామికులు చెబుతున్నారు. ప్రభుత్వం తమ కుటీర పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.